క్లుప్తంగా

గ్యాస్ కనెక్షన్లకు దరఖాస్తుల పరిశీలన

టెక్కలి: దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న మహిళల కోసం అమలు చేస్తున్న ఉజ్వల యోజన గ్యాస్ పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకుడు హెచ్.ఉదయ్‌భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 3వ విడత పంపిణీలో భాగంగా స్థానిక గ్యాస్ ఏజెన్సీల్లో దరఖాస్తులను పరిశీలించారు. ప్రతిఒక్కరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్కూల్‌గేమ్స్ పోటీల్లో పోలవరం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

టెక్కలి: ఏపీ స్కూల్ గేమ్స్ పోటీల్లో భాగంగా పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. అండర్ -14, 17 విభాగంలో త్రో బాల్, యోగా పోటీల్లో ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయుడు పి.విలియమ్ తెలిపారు. వీరిని శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ పి.జగదీష్, యోగా ట్రైనర్ పి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన దువ్వాడ వాణి



టెక్కలి: టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్‌ను వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో టెక్కలి నియోజకవర్గంలో పలు అంశాలపై చర్చించారు. వాణితో పాటు డాక్టర్ దువ్వాడ హైందవి ఉన్నారు.

బదిలీ టీచర్లకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: కొళిగాం ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వేరే పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం స్కూల్ ఆవరణలో సహోపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వాసుదేవరావు ఉపాధ్యాయులు శేషగిరిరావు, రామినాయుడు, రాణి బెహరా, మీనా బెహరా, కృష్ణారావు, హరీష్ నాయుడు, ఎల్.కె.బెహరాల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నరేంద్రనాథ్ పట్నాయక్, జ్యోతి, పద్మావతి పాల్గొన్నారు.

ఐటీఐ కౌన్సెలింగ్ పూర్తి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాసలోని డాక్టర్ కణితీస్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నాలుగో విడత కౌన్సెలింగ్ శుక్రవారంతో పూర్తయ్యింది. 78 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా సివిల్, వెల్డర్, డీజిల్ మెకానికల్, ఫిట్టర్, ఎలక్ట్రికల్, కోపాలో ఉన్న ఖాళీ సీట్లు కేటాయించారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి కామేశ్వరరావు, ప్రిన్సిపాల్ పైల జవహర్, అధ్యాపకులు పూన వెంకటరమణ, జూనియర్ అసిస్టెంట్ దామోదర పాల్గొన్నారు.

కాశీబుగ్గ ఇన్‌చార్జి సీఐగా శంకరరావు



జి.శంకరరావు

కాశీబుగ్గ : కాశీబుగ్గ పోలీసుస్టేషన్ ఇన్‌చార్జి సీఐగా కాశీబుగ్గ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.శంకరరావుకు బాధ్యతలు అప్పగించారు. ఆగస్టు 29 వరకు సీఐగా పనిచేసిన గుగ్గిలాపు శ్రీనివాసరావును వీఆర్‌కు పంపించిన విషయం తెలిసిందే.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



తిప్పనపుట్టుగ-కేశుపురం జట్ల మధ్య మ్యాచ్

ఇచ్ఛాపురం రూరల్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తిప్పనపుట్టుగలో శుక్రవారం ఉత్కళాంధ్ర స్థాయి కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి 24 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. వీటిని తిలకించేందుకు పరిసర గ్రామాలకు చెందిన క్రీడాభిమానులు భారీగా తరలివచ్చారు. ఎం.ఆనంద్ రిఫరీగా వ్యవహరించారు.

రూ. 20 కోట్లతో
సోంపేట రహదారి విస్తరణ

- 7.5 కిలోమీటర్ల మేర పనులకు నిధులు మంజూరు
- రోడ్డును పరిశీలించిన జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, సమన్వయకర్త సాయిరాజ్



రహదారిని పరిశీలిస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, పిరియా సాయిరాజ్

సోంపేట: సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. సోంపేట రహదారి విస్తరణకు లైన్ క్లియర్ అయ్యింది. మొదటిగా విడత రూ.20 కోట్లు నిధులు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి విడుదలైనట్లు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ శుక్రవారం వెల్లడించారు. ఈ మేరకు సోంపేట మేజర్ పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోంపేట రహదారి విస్తరణ ఆవశ్యకతను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి గతంలో తీసుకెళ్లామన్నారు. దీనిపై స్పందించి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మొదటి విడతగా రూ.20 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మొదటి విడతగా కొర్లాం జాతీయ రహదారి నుంచి బారువ జంక్షన్ మీదుగా లక్కవరం వరకు 4.5 కిలోమీటర్లు, సోంపేట-కంచిలి జాతీయ రహదారి వద్ద నుంచి సోంపేట పట్టణంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు 2.7 కిలోమీటర్లు కలిపి మొత్తం 7.2 కిలోమీటర్ల మేర రహదారి 66 అడుగుల విస్తరణ చేపట్టనున్నట్లు వివరించారు. సోంపేట మేజర్ పంచాయతీని అత్యున్నత స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పట్టణంలో ఇరువైపులా ఏడు మీటర్ల వెడల్పైన రహదారితో పాటు మధ్యలో విద్యుత్ వెలుగులకు మీటరు, రెండు వైపులా డ్రైనేజీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సోంపేటలో మిగిలిన రహదారి విస్తరణ విషయమై వ్యాపారులు, ప్రజలతో త్వరలో సమావేశం నిర్వహించి వారి అంగీకారం మేరకు పనులు చేపడతామన్నారు. ప్రజల ఆస్తులకు భంగం కలిగించకుండా పనులు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నామని, గత ప్రభుత్వం చేసిన తప్పులు పునావృతం కానివ్వబోమని చెప్పారు. నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విస్తరణ పనులు చేపట్టనున్న రహదారిని అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ రామినాయుడు, ఏఈ మోహన్‌రావు, ఎంపీడీఓ బెందాళం వెంకటరమణ, పంచాయతీ ఈవో వరప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, సర్పంచ్ నగిరి ప్రభావతి, మండల కమిటీ అధ్యక్షుడు తడక జోగారావు, జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, ఉప సర్పంచ్ మల్లా వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు పాడుగు కామేష్, బి.ధర్మారావు, పార్టీ నాయకులు శిలగాన భాస్కరరావు, ఉగ్రపల్లి తిరుపతిరావు, వైకుంఠరావు,గోవిందరావు, ఢిల్లీరావు పాల్గొన్నారు.



విజయ, సాయిరాజ్‌లను సన్మానిస్తున్న సర్పంచ్

సాయిరాజ్ దంపతులకు ఘన సన్మానం

సోంపేట: రహదారి విస్తరణకు నిధులు మంజూరు చేయించినందుకు సోంపేట మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నగిరి ప్రభావతి, ఈవో వరప్రసాద్ శుక్రవారం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా సాయిరాజ్, నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ దంపతులను సన్మానించారు.

క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల పరిశీలన



లబ్ధిదారు ఇంటి వద్ద ఆరా తీస్తున్న బీసీ వెల్ఫేర్ అధికారులు

కవిటి: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న చేదోడు పథకంలో భాగంగా నాయీ బ్రాహ్మణులకు, టైలర్లకు, రజకులకు ఇచ్చే ప్రోత్సాహకాలకు సంబంధించి జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారులు శుక్రవారం కవిటి-1 సచివాలయంలో తనిఖీలు నిర్వహించారు. మండలం మొత్తం 556 మంది అర్హులుగా నమోదు కాగా, ఒక్క కవిటి-1 సచివాలయంలోనే 78 అర్హులుగా ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి నిర్ధారణకు జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం నుంచి భాస్కర్ వచ్చి తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగి రాజేశ్వరి ఉన్నారు.

జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలి

టెక్కలి: నియోజకవర్గంలో చేపట్టిన జలజీవన్ మిషన్ పనులు త్వరగా పూర్తి చేయాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. టెక్కలిలో తన కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం, చెట్లతాండ్ర, ఆరికివలస పంచాయతీల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంపై సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

జీపీఎస్‌పై నిరసన

ఇచ్ఛాపురం రూరల్: ప్రభుత్వం తీసుకువచ్చిన జీపీఎస్ విధానంపై తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది వ్యతిరేకించారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ సదాశివుని గురుప్రసాద్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు.

క్విజ్ పోటీల్లో కొత్తపల్లి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

మందస: ఇటీవల పలు ప్రాంతాల్లో జరిగిన క్విజ్ పోటీల్లో కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటుతున్నారు. విజేతలను సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకురాలు సేనాపతి దివ్య, ఎంఈఓ మర్రిపాటి లక్ష్మణరావు, గ్రామపెద్దలు ఎస్.మురళీ తదితరులు శుక్రవారం అభినందించి ప్రత్యేక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.గణేశ్వరరావు, పీఎంసీ చైర్మన్ తెప్ప జ్యోతి, ఉపాధ్యాయులు గవ్వ భీమారావు, ఎం.లక్ష్మణరావు, ఎస్.కిరణ్‌కుమార్, ఎస్.అబ్రహం, పి.రాంబాబు, ఎం.చిత్రసేను, జి.గోపాలకృష్ణ, ఎం.దామోదర్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



వెంకటరమణ

టెక్కలి రూరల్: తొలుసూరుపల్లి గ్రామానికి చెందిన తిర్లంగి వెంకటరమణ అనే 48 ఏళ్ల వ్యక్తి మూడు రోజులుగా కనిపించడం లేదని కుటుంబసభ్యులు శుక్రవారం టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకటరమణకు మతిస్థిమితం సరిగ్గా లేదు. ఈ నెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలే దు. అన్నిచోట్లా వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

మందస: ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని మహేంద్ర రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ బడే పాపారావుకు వినతిపత్రం అందజేశారు. వరి నాట్లు ఆలస్యంగా పడటం, నత్రజని, ఎరువులు వేయకపోవడంతో దుబ్బు కట్టక పిలకలు రావడం లేదన్నారు. నాట్లు పడని ప్రాంతాల్లో అపరాలు, చిరుధాన్యాల విత్తనాలను రైతులకు ఉచితంగా అందజేయాలన్నారు. ఆర్బీకేల ద్వారా 80 కిలోల జీడి బస్తా రూ.16 వేలకు కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బెస్త కామేశ్వరరావు, కొర్ల హేమారావుచౌదరి, ప్రఫుల్లోగౌడ, మురపాల నారాయణరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం ఈఓపీఆర్‌డీగా సత్యనారాయణ



ఇచ్ఛాపురం రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీగా కె.వి.ఏ.సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన సత్యనారాయణ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. రెండేళ్లగా ఈఓపీఆర్‌డీ పోస్టు ఖాళీగా ఉంది.

కోలాహలంగా లడ్డూవేలం



లడ్డూ దక్కించుకున్న కమిటీ సభ్యులు

కవిటి: మండలంలోని ఆర్.భైరిపురం పంచాయతీలో లడ్డూల వేలం కోలాహలంగా జరుగుతోంది. 1280 మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో ఈ ఏడాది 13 గణేష్ మండపాలు నెలకొల్పారు. ప్రతి చోటా లడ్డూ వేలం నిర్వహించగా రూ.3,56,401 వసూలయ్యాయి.

జయహో గణేశా..!

వజ్రపుకొత్తూరు/వజ్రపుకొత్తూరు రూరల్/కాశీబుగ్గ/కోటబొమ్మాళి/ఇచ్ఛాపురం/కవిటి/సోంపేట: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వజ్రపుకొత్తూరు మండలం కొత్తపేట గణగళ్లవారి వీధిలో శుక్రవారం మహా అన్నదానం నిర్వహించారు. గుంటు విజయర్‌కుమార్, హేమలత దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించిన అనంతరం 1800 మందికి అన్నదానం చేశారు. అనంతరం నిమజ్జోత్సవం జరిపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుంటు వాసు, పూజా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పెద్దబొడ్డపాడు, గుణుపల్లి, బెండి, వజ్రపుకొత్తూరు తదితర గ్రామాల్లోనూ అన్నదానం నిర్వహించారు. కోటబొమ్మాళి మండలం కొత్తపేట ఇందిరమ్మ కాలనీ, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని న్యూకాలనీ, గాంధీనగర్‌లోనూ ఘనంగా అన్నదానాలు నిర్వహించారు.




ఇచ్ఛాపురం రూరల్: సామూహిక కుంకుమ పూజల్లో విద్యార్థినులు



జింకిభద్ర గ్రామంలో పెద్ద వీధిలో కుంకుమపూజలు



కాశీబుగ్గ: న్యూకాలనీలో అన్నదానం



ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచిలో ఏర్పాటు చేసిన గణపతి



వజ్రపుకొత్తూరు: కొత్తపేటలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

నవరత్నాలతో నవశకానికి నాంది



గడపగడపలో పాల్గొన్న పిరియా విజయ, సాయిరాజ్

కవిటి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలతో నవశకానికి నాంది పలికారని జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్ సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. శుక్రవారం డిగొనపపుట్టుగ పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్,జేసీఎస్ కన్వీనర్ జల్లు యుగంధర్, యూత్ కన్వీనర్ వై.అశోక్, రెడ్డిక కార్పొరేషన్ ఛైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, కవిటి వైస్ ఎంపీపీ పూడి నేతాజీ, ఏఎంసీ ఛైర్మన్ నూతలపాటి బాబూరావు, పీఏసీఎస్ ఛైర్మన్ దేవరాజ్ సాహూ, మండల కో-ఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్, రాంపత్ని చిట్టిబాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్ఛాపురం/రూరల్: పురపాలక సంఘం పరిధిలోని కార్జీవీధి(బీసీ-డి), కండ్రవీధి(బీసీ-డి), బెల్లుపడ కాలనీ (బీసీ-బి) అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీఓ నాగరాణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కవిటి మండలం బసవకొత్తూరులో కార్యకర్త (ఓసీ), ఒంటూరు కేంద్రంలో సహాయకులు(బీసీ-ఈ), పెద్ద కర్రివానిపాలెం-1(బీసీ-ఏ), మున్సిపాలిటీ కార్జీవీధి కేంద్రంలో సహాయకులు(బీసీ-డీ), కండ్ర కాలనీ(బీసీ-డీ), బెల్లుపడ కాలనీ(బీసీ-బీ) పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 30లోపు ఇచ్ఛాపురం కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

కోటబొమ్మాళి: మండలంలోని కురుడు-3వ కేంద్రంలో కార్యకర్త(ఎస్టీ), కోటబొమ్మాళి-6వ కేంద్రంలో సహాయకులు(బీసీ-బి), రెడ్డిక వీధి(ఎస్టీ), చిట్టివలసలో సహాయకులు(బిసి-ఎ), భగీరథపురంలో సహాయకులు (ఓసీ) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీఓ హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



పథకాల బ్రోచర్లు పంపిణీ చేస్తున్న దువ్వాడ వాణి

నందిగాం: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దోహదపడుతోందని వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. శుక్రవారం బడగాం పంచాయతీ ఆకర్లగోకర్లపల్లి, కాశీరాజు కాశీపురంలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధి వివరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కూన శాంతారావు, దువ్వాడ హైందవి, రోణంకి ఢిల్లేశ్వరరావు, పోలాకి మోహనరావు, అట్టాడ శ్రీనివాసరావు, బంగారు బాలరాజు, ఆసపన్న జనార్దనరావు, గంగాధర్, వాసుదేవనాయుడు, వెంకటరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం



కంచిలి: అన్ని ఆవాస ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. పెద్దశ్రీరాంపురం సచివాలయం పరిధి కత్తివరం పంచాయతీ కేంద్రంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.4లక్షలతో మంజూరైన సీసీకాలువ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దుర్గాసి శివ, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు దుర్గాసి ధర్మారావు, పొందూరు ముఖలింగం పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూలుపై దృష్టి సారించాలి



ఇచ్ఛాపురం: పురపాలక సంఘం పరిధిలో ఆస్తి పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి సిబ్బందికి సూచించారు. ఇచ్ఛాపురం పురపాలక సంఘం కార్యాలయంలో శుక్రవారం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.3కోట్ల11 లక్షలకు గాను రూ.83 లక్షలు మాత్రమే వసూలైందన్నారు. సమావేశంలో కమిషనర్ ఎన్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

టెక్కలి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రాణాంతక దోమలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా సహాయ మలేరియా నివారణాధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. టెక్కలిలోని పట్టుమహదేవి కోనేరు, పిల్లల బంద, పిల్లి పాపయ్య కోనేరు, పాత్రుని కోనేరులో గంబూజియా చేప పిల్లలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాంతక దోమల లార్వాలను గంబూజియా చేపలు తినడంతో వాటి ప్రభావం తగ్గుముఖం పడుతుందన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి జి.కూర్మనాయకులు, సిబ్బంది చంద్రశేఖర్, పండా, ఆట్ల రాహుల్‌కుమార్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

కాశీబుగ్గ: లింగ నిర్ధారణ పరీక్షలు చేపడితే చర్యలు తప్పవని ఆర్‌డీఓ టి.సీతారామమూర్తి హెచ్చరించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ప్రైవేటు స్కానింగ్ సెంటర్‌ను శుక్రవారం సందర్శించి సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రసాదరావు, డీఎంఓఎం వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ సూర్యకళ, డాక్టర్ యు.కిరణ్‌కుమార్, డాక్టర్ సురేష్‌కుమార్, ఏపీఎన్‌జీఓ అధ్యక్షుడు బోనెల గోపాలరావు, సిబ్బంది ఎస్.రుషికేశ్వరరావు, గెస్ట్ ఎన్‌జీఓ నిరంజన్ కుమార్ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును పరిరక్షించుకుందాం

మందస/వజ్రపుకొత్తూరు రూరల్: విశాఖపట్నంలోని ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటుపరం కాకుండా రక్షించుకుందామని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం పిలుపునిచ్చారు.హరిపురంలో శుక్రవారం ఉక్కు రక్షణ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.గోవిందరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సీఐటీయు నాయకులు ఎన్.గణపతి, ఆర్.దిలీప్‌కుమార్, ఎం.ధర్మారావు, కె.కేశవరావు, రమణ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వజ్రపుకొత్తూరు మండలం బెండిగేట్ వద్ద యాత్ర కొనసాగింది. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బమ్మిడి అనందరావు, బి.సుగుణ, ఎన్.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం

కవిటి: బొరివంకలో ఉద్దానం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించిన కాళికావేషధారణల పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. పలాస డివిజన్ పరిధిలోని 22 మంది కళాకారులు కాళికా వేషధారణలతో ప్రదర్శన నిర్వహించి ఆకట్టుకున్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ దుద్ది సతీష్, యూవైసీ అధ్యక్షుడు దీనబంధు, సభ్యులు కేశవరావు, కాళిదాసు, డొంబురు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

కాశీబుగ్గ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కన్వీనర్ పట్ట తవిటయ్య ఆధ్వర్యంలో పలాస నియోజకవర్గ స్థాయి అండర్-14, 17 కబడ్డీ, ఖోఖో ఎంపిక పోటీలు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. పలాస ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దట్ల దాశరథి, పీఈటీలు పద్మలోచన, ఎస్.రామారావు, పి.గజేంద్రరావు, జోగారావు, సీహెచ్ రాంజీ, శంకరరావు, ఆర్.శ్రీను, జి.లోకేశ్వరరావు, జె.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

ఇచ్ఛాపురం: బెల్లుపడ కాలనీ-2 సచివాలయం పరిధిలో నివాసముండే దక్కత యర్రయ్య గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఈయన భార్య దక్కత హేమకు వైఎస్సార్ బీమా ద్వారా తక్షణ సాయంగా రూ.10వేలు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రమేష్ సచివాలయ సిబ్బంది బాలకృష్ణ, వలంటీర్ బి.గణేష్ పాల్గొన్నారు.